క్లుప్తంగా

చీకటిని పారదోలే వెలుగుల పండుగ దీపావళి

● మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



సూర్యాపేటటౌన్ : చీకటిని పారదోలే వెలుగుల పండుగ దీపావళి అని.. దీపాల కాంతుల్లా రాష్ట్రంలోని ప్రతి ఇంటా వెలుగులతో నిండాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆకాంక్షించారు. గురువారం దీపావళి పండుగ సందర్భంగా బుధవారం ఆయన ముందస్తుగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మనలో అజ్ఞానాంధకారాన్ని తొలగించి, చైతన్యాన్ని రగిలించి బంగారు తెలంగాణ సాధనలో నూతనోత్తేజంతో ముందడుగు వేయాలన్నారు.

వైభవంగా రుద్రాభిషేకం



రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

చివ్వెంల : మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామశివారులోని గిరిదుర్గంలో వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఆశ్వయుజ మాసశివరాత్రి సందర్భంగా ఏకవార రుద్రాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు బ్రహ్మశ్రీ మనోహరశర్మ మంత్రోచ్చరణతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం కృష్ణకుమార్, బంధకవి కృష్ణమోహన్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం పట్టణ కన్వీనర్‌గా సతీష్

సూర్యాపేటటౌన్ : పట్టణానికి చెందిన మిట్టకోల సతీష్ పద్మశాలి సంఘం పట్టణ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి బుధవారం స్థానికంగా సతీష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం సతీష్ మాట్లాడుతూ.. పద్మశాలి సంఘం బలోపేతానికి, ఐక్యతకు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

మండల ఎస్ఐగా మహేశ్వర్ బాధ్యతల స్వీకరణ



వి.మహేశ్వర్

చివ్వెంల : మండల నూతన ఎస్ఐగా వి.మహేశ్వర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న బి.వెంకట్‌రెడ్డి బదిలీపై సూర్యాపేట వన్‌టౌన్ ఎస్ఐగా వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐకి అదనపు ఎస్ఐ వెంకటర్నతం, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు గునగంటి వెంకటేశ్వర్లు, గోవర్ధన్, రాములు, సిబ్బంది శ్రీనివాస్, నర్సింహరావు, రవి, లింగానాయక్ తదితరులు ఉన్నారు.


చెవిటి వెంకన్నకు సన్మానం



చెవిటి వెంకన్నను సన్మానిస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు యోగానందచారి

అర్వపల్లి : రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడిగా నియమితులైన డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌ను బుధవారం స్థానికంగా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి సన్మానించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, పెసర సతీష్‌రెడ్డి, కుంటిగొర్ల శ్రీనివాస్, బాషపోలు శ్రీనివాస్, మహేశ్వర్, ఉపేందర్, లింగయ్య, మనోహర్, సందీప్, అనిల్, మధు, రవి, యాదగిరి ఉన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి చేపపిల్లల పంపిణీ



చెరువులో చేపపిల్లలు వదులుతున్న మత్స్య సహకార సంఘం సభ్యులు

చివ్వెంల : మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి కోసమే ప్రభుత్వం చేపపిల్లలను పంపిణీ చేస్తుందని మత్స్య సహకార సంఘం గ్రామ అధ్యక్షుడు చింతకాయల సైదులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఐలాపురం గ్రామంలోని నాగులమ్మ చెరువులో ప్రభుత్వం పంపిణీ చేసిన చేపపిల్లలు వదిలారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మహేష్, నాగయ్య, భద్రయ్య, అయోధ్య, కృష్ణ, సైదులు, రాము, సురేష్ పాల్గొన్నారు.

నిధులున్నా.. పనులు సున్నా

● కొత్తగూడెం బీటీ రెన్యువల్‌కు మూడేళ్ల కిందట రూ.70లక్షలు మంజూరు
● టెండర్ ప్రక్రియ పూర్తి అయినా పనుల ప్రారంభంలో జాప్యం
● అడుగడుగునా గుంతలతో ప్రజల అవస్థలు
● వెంటనే పనులు ప్రారంభించాలని వేడుకోలు



అధ్వానంగా మారిన కొత్తగూడెం రోడ్డు



అడుగడుగునా గుంతలమయమైన రహదారి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని అర్వపల్లి నుంచి చాకలిగూడెం మీదుగా కొత్తగూడెం వరకు ఉన్న 6కిమీ బీటీరోడ్డు పూర్తిగా ధ్వంసమై అధ్వానంగా మారింది. దీంతో ఈ గ్రామస్తులు ప్రయాణాలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గత ప్రభుత్వం గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలోఉంచుకుని ఈ రోడ్డు బీటీ రెన్యువల్ కోసం మూడేళ్ల కిందట రూ.70లక్షలు మంజూరు చేసింది. కాని అప్పటి నుంచి ఇప్పటి వరకు బీటీ రెన్యూవల్ పనులు మాత్రం ప్రారంభంకాలేదు. ఈ రోడ్డు దెబ్బతిని 10ఏళ్లు కావస్తున్నా ఇబ్బందులు పడుతూ ప్రయాణాలు సాగిస్తున్నారు. అప్పటి నుంచి బీటీ రెన్యువల్ కోసం ప్రజలు అధికారులకు మొరపెట్టుకోవడంతో ఎట్టకేలకు మూడేళ్ల కిందట బీటీ రెన్యూవల్‌కు నిధులు మంజూరు చేశారు. ఇటీవల టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. అయినా కాంట్రాక్టర్ ఇప్పటికీ పనులు ప్రారంభించడంలేదు.

పనులు ప్రారంభించాలని వేడుకోలు..

అర్వపల్లి నుంచి కొత్తగూడెం వరకు రోడ్డు పూర్తిగా బీటీ లేచిపోయి పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. సాయంత్రమైతే ఈ రోడ్డుపై ప్రయాణం చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఆటోలు, ఇతర వాహనాలు దెబ్బతింటుండటంతో పూర్తిగా నిలిపివేశారు. కేవలం ద్విచక్రవాహనాలు మాత్రమే ఎంతో కష్టంగా వెళ్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి బీటీ రెన్యువల్ పనులను ప్రారంభించి తమ కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటోకు ప్రతిరోజూ మరమ్మతులే



“ మా గ్రామానికి వెళ్లే బీటీరోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. ప్రతిరోజూ ఈ రోడ్డులో ఆటో నడిపిస్తాను. ఒక్క ట్రిప్ అర్వపల్లికి వెళ్లి వచ్చేసరికి మరమ్మతులకు వస్తుంది. అడుగడుగునా గుంతలు కావడంతో ఆటో తరచూ ఇబ్బందులు పెడుతుంది. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

– రవీందర్, ఆటోడ్రైవర్, కొత్తగూడెం

త్వరలో పనులు ప్రారంభిస్తాం



“ కొత్తగూడెం రోడ్డు బీటీ రెన్యువల్‌కు గతంలో అనేకసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్‌లు ముందుకు రాలేదు. ఇటీవల టెండర్ ప్రక్రియ పూర్తైంది. కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరలో బీటీ రెన్యువల్ పనులను ప్రారంభించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– బాబూరావు, పీఆర్ డీఈ

అమరవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలి



సభ కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

నాగారం : అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని తిరుమలగిరి పట్టణంలో నవంబర్–12న నిర్వహించే నక్సల్‌బరి ఉద్యమ అమరవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని యానాల వీరారెడ్డి స్మారక స్థూపం వద్ద సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన పోరాటంలో, ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో మెరికలాంటి పోరాట యోధులు చంపివేయబడ్డారని అన్నారు. ప్రతిఘటన పోరాట నిర్మాత చంద్ర పుల్లారెడ్డి కూడా నవంబర్ 9న నేలకొరిగారని వారిని స్మరించుకుంటూ నవంబరు 1నుంచి 9వరకు అమరవీరుల వారోత్సవాలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. సంస్మరణ సభ అనంతరం 12న తిరుమలగిరిలో నిర్వహించే భారీ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షులు సంపేట కాశయ్య, తడకమళ్ల సంజీవ, జాజుల సామెలు, ఆకుల సుభాష్, బొమ్మగాని జానీ, ఈదుల పరుశురాములు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఉద్యమించే వారికి అవకాశం ఇవ్వాలి



ప్రచారం నిర్వహిస్తున్న తీకుల సాయిరెడ్డి

ఆత్మకూర్(ఎస్) : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఉద్యమించే వారికి ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని టీపీయూఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు తీకుల సాయిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిఒక్క ఉపాధ్యాయుడు నవంబర్ 6వతేదీలోగా ఎమ్మెల్సీ ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యారంగం అభివృద్ధికి పాటుపడే వారికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారులు సంఘం బలోపేతానికి కృషి చేయాలి



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

సూర్యాపేట : తెలంగాణ గెజిటెడ్ అధికారులంతా ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం, సంఘం బలోపేతం కోసం పనిచేయాలని టీజీఓ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి జిల్లా కేంద్రంలో హౌజింగ్ సొసైటీ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. అనంతరం తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా భూపాల్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.నాగేందర్, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ బి.రమేష్, డి.మనోహర్, డి.స్వప్న, జగదీశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి.పాండునాయక్, సహాయ కార్యదర్శిగా ఎస్‌కే.జానిపాషా, చల్ల రాంబాబు, ఎ.పద్మావతి, కోశాధికారిగా ఎస్.రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాలెంల యాదగిరి, పబ్లిసిటి సెక్రటరీగా జె.వెంకటేశ్వర్‌రావు, ఆఫీస్ సెక్రటరీగా జె.జగదీష్‌కుమార్, కల్చరల్ సెక్రటరీగా చీకూరి కృష్ణ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సెక్రటరీగా దాసరి మల్సూర్, ఎగ్జిక్యూటీవ్ కమిటీ మెంబర్‌గా దోమల ఉదయ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారులుగా రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పరమేశ్వర్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా బాధ్యురాలు శిరీష వ్యవహరించగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా కోశాధికారి ఉపేందర్‌రెడ్డి, గోపి, మోహన్‌రావు, మూర్తి తదితరులు ఉన్నారు.

మహిళలు పనిచేసే చోట భద్రత కల్పించాలి



ప్రచారం చేస్తున్న మహిళా ఉద్యోగులు, నాయకులు

భానుపురి (సూర్యాపేట) : దేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులు, ఉద్యోగులకు పనిప్రదేశాల్లో భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని వివిధ సెంటర్లలో పనిచేస్తున్న మహిళలకు రక్షణ కల్పించాలని కోరుతూ కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోజురోజుకు మహిళలపై లైంగిక వేధింపులు, హింస, దాడులు పెరిగిపోయాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని అరికట్టడంలో ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. ప్రతిరోజు ఏదో ఒక చోట మహిళలపై అత్యాచారాలు జరగడం దారుణమన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, క్యాజువల్ పేరుతో మహిళా కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, సహాయ కార్యదర్శి దేశోజు మధు, కార్మికులు ప్రణీత, లత, రజియా పాల్గొన్నారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో జయ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : రామానుజన్ గణిత అకాడమి రామచంద్రాపురం వారు నిర్వహించిన గణిత ఒలింపియాడ్‌లో జిల్లా కేంద్రంలోని జయ ఐఐటీ స్కూల్ నుంచి 129మంది విద్యార్థులు రెండో లెవల్‌కు అర్హత సాధించినట్లు కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదోతరగతి నుంచి ఒకరు, 6వ తరగతి నుంచి 16మంది, 7వతరగతి నుంచి 22మంది, 8వతరగతి నుంచి 22మంది, 9వతరగతి నుంచి 32మంది, 10వతరగతి నుంచి 21మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి తదితరులు అభినందించారు.

మహాసభ కరపత్రాల విడుదల

మద్దిరాల : మండల కేంద్రంలో వచ్చేనెల 2వ నిర్వహించే సీపీఎం మండల మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ఆ పార్టీ మండల కార్యదర్శి కల్లెపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలపై అనునిత్యం పోరాడే పార్టీ సీపీఎం మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పోలోజు సైదులు, వల్లపు మలయ్య, ఉబ్బని వీరయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలి

తుంగతుర్తి : రైతులు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెంపటి గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అబ్బగాని పద్మసత్యనారాయణ, సీసీ గడ్డం యాదగిరి, జమున, యాకయ్య, నర్సయ్య, నాగయ్య, వెంకన్న, శంకర్, అంజయ్య, నరేష్, లక్ష్మమ్మ, మహేష్, రమేష్, మహిళా సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

మద్దిరాల : అధికారులు ఐకేపీ కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట గోపి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ కేంద్రాలను ప్రారంభించి పదిరోజులు గడుస్తున్నా ఇప్పటికీ కొనుగోళ్లు ప్రారంభించకపోడం సరికాదన్నారు. అదే విధంగా తేమశాతం సన్నాలకు కూడా 17శాతం పెంచాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కందాల శంకర్‌రెడ్డి, పులుసు సత్యం, మండల కార్యదర్శి కల్లెపల్లి భాస్కర్, సైదులు, మల్లయ్య, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

రూ.500బోనస్ ఇవ్వాలి

తుంగతుర్తి : ప్రభుత్వం దొడ్డు రకం ధాన్యానికి క్వింటాళ్‌కు రూ.500బోనస్ చెల్లించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెంపటి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. దొడ్డు ధాన్యానికి, సన్న ధాన్యానికి వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులు ధాన్యం అమ్ముకోవడానికి ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఒకే కేంద్రంలో సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేసే విధంగా అధికారులకు చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తునికి సాయిలు, భిక్షం, శ్రీనివాస్, లక్ష్మి, లాలయ్య పాల్గొన్నారు.

కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



మద్దిరాల : రైతువేదికలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ అమీన్‌సింగ్



ఆత్మకూర్ (ఎస్) : శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

మద్దిరాల : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కుటుంబ సర్వేపై సూపర్‌వైజర్లకు, ఎన్యూమరేటర్లకు నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. నవంబర్ 6నుంచి 18వతేదీ వరకు ఈ సర్వే కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం ఉన్నతమైన ఆలోచనతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను చేపట్టిందన్నారు. ఈ సర్వే బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, అదే విధంగా నిరుపేద కుటుంబాలను సామాజికంగా, ఆర్థికంగా, విద్యపరంగా, రాజకీయంగా, వారిని అభివృద్ధి చేయడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. అధికారులు ఆయా గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఏఓ మల్లారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అఖిల్, ఎంఈఓ వెంకటనారాయణ, రెవెన్యూ సిబ్బంది శ్రీధర్, మల్సూర్, వహీద్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేను విజయవంతం చేయాలి

తిరుమలగిరి : మండలంలో జరిగే సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి సర్వేను విజయవంతం చేయాలని తహసీల్దార్ హరిప్రసాద్ కోరారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలో నిర్వహించే కుటుంబ ఇంటింటి సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓలాజరస్, మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, మండల పంచాయతీ అధికారి భీమ్‌సింగ్, మాస్టర్ ట్రైనర్, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ వి.బ్రహ్మయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ఎన్యూమనేటర్లకు ఒక్క రోజు శిక్షణ నిర్వహించి మాట్లాడారు. ఈ సర్వేలో 56అంశాలు ఉంటాయని, కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి నమోదు చేయాలన్నారు. అనంతరం సర్వే వివరాలను నవంబర్ 19నుంచి 27వవరకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.మారయ్య, ఎంఈఓ వాసం ప్రభాకర్, ఏఓ కృష్ణకాంత్, ఎంపీఎస్ఓ రమేష్, ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్లు, డేటాఎంట్రీ ఆపరేటర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీ కులగణనను పకడ్బందీగా చేపట్టాలని మండల తహసీల్దార్ వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కులగణన చేపట్టే ఎన్యూమరేటర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్యూమరేటర్లు తప్పులు లేకుండా ప్రభుత్వ లక్ష్యం మేరకు కులగణన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హసీం, ఎంఈఓ ధారాసింగ్, కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటాచారి, మాస్టర్ ట్రైనర్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేను విజయవంతం చేయాలి

అర్వపల్లి : నవంబర్ 6నుంచి జరిగే సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను ఎన్యుమరేటర్లు విజయవంతం చేయాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు కోరారు. బుధవారం మండలంలోని రామన్నగూడెంలోని రైతు వేదికలో సమగ్ర కుటుంబ సర్వేపై ఎన్యూమరేటర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.బాలునాయక్, ఏఓ పి.గణేష్, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణనపై మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎన్యూమనేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దయానంద్ మాట్లాడుతూ.. ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల సమగ్ర ఇంటింటి సర్వే చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషుకుమార్, ఎంఈఓ బోయిని లింగయ్య, డీటీ కంఠమయ్య, ట్రెయినర్లు, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును అడ్డుకున్న బీఆర్ఎస్



సూర్యాపేటటౌన్ : తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సూర్యాపేటటౌన్ : అధికారంలో లేకపోయినా ఎలక్ట్రిసిటీ రెగ్యులటరీ కమిషన్ పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని ప్రజల పక్షాన కొట్లాడి విద్యుత్ చార్జీలు పెరగకుండా బీఆర్ఎస్ పార్టీ అడ్డుకుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసి పూలమాల వేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ చార్జీలను పెంచాలన్న ప్రయత్నానికి మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, ఇతర రాష్ట్ర నాయకులు అడ్డుకున్నారన్నారు. ఎలక్ట్రిసిటీ రెగ్యులటరీ కమిషన్ ముందు తమ వాదనలు వినిపించి చార్జీలు పెంచకుండా.. తద్వారా పేద ప్రజలపై భారం పడకుండా చూడడంలో బీఆర్ఎస్ గొప్ప విజయం సాధించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు వైవి, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జీడీ భిక్షం, బూర బాలసైదులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటంతోనే విద్యుత్ చార్జీలు తగ్గింపు

నాగారం : కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచాలని చేసిన ప్రతిపాదనలపై బీఆర్ఎస్ చేసిన పోరాటంతోనే విద్యుత్ చార్జీలు తగ్గాయని ఆ పార్టీ మైనార్టీ సెల్ సంయుక్త కార్యదర్శి షేక్ నజీర్‌పాష అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలపై రూ.18,500 కోట్ల విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపాలని ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను బీఆర్ఎస్ పోరాట ఫలితంగానే ఈఆర్సీ తిరస్కరించిందన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు షేక్ నాగుల్‌మీరా, హుస్సేన్, శ్రీను, బడేసాబ్, జానీ, సైదులు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు

అర్వపల్లి : విద్యుత్ ధరలు పెంచాలని ప్రభుత్వం చేసిన ప్రతిపాదనపై ప్రభుత్వం వెనక్కి తగ్గి ధరల పెంపును ఉపసంహరించుకోవడాన్ని హర్షిస్తూ పార్టీ పిలుపు మేరకు బుధవారం అర్వపల్లిలో బీఆర్ఎస్ నాయకులు బాణసంచాలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, చిర్రబోయిన వెంకన్న, కందుల దశరథరామారావ్, మిర్యాల వెంకన్న, ఖమ్మంపాటి కరుణాకర్, సంపతి కిరణ్, తిమ్మిడి ప్రవీణ్, మధు, నాయకులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న మండల జేఏసీ నాయకులు

ఆత్మకూరు(ఎస్) : గ్రామాల్లో బహిరంగంగా మద్యం తాగినా, అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల జేఏసీ నాయకులు బుధవారం ఎంపీడీఓ హసీం, ఏఎస్ఐ శంకర్‌నాయక్‌లకు వినతిపత్రం అందజేశారు. ముందస్తుగా మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం బైక్ ర్యాలీగా ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకొని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగడంతో మహిళలు ఒంటరిగా చేల వద్దకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారని, కొందరు చేలల్లో, పొలాల్లో మద్యం తాగిసీసాలు పలగొట్టడంతో రైతులు, పశువులు ప్రమాదాలు గురవుతున్నారని అన్నారు. యువకులు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి రోడ్డు ప్రమాదాలకు గురికావడంతో కుటుంబాలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. ప్రతి గ్రామంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని అధికారులు బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ కమిటీ అధ్యక్షుడు భూపతి రాములు, సలహాదారు దండ వెంకటరెడ్డి, గంపల కృపాకర్, దొంతగాని కరుణాకర్, తగుళ్ల జనార్దన్, మేడి కృష్ణ, గుండు వెంకన్న, వత్సవాయి లలిత, రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

సూర్యాపేటటౌన్: ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈఎన్‌టీ క్లినిక్, డెంటల్ ఆస్పత్రుల పనితీరు, రిజిస్ట్రేషన్ పొందేందుకు ఉన్న అర్హతలను పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సర్టిఫికెట్లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట మనోహర రాణి, రవితేజ, కార్తీక్ తదితరులున్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులును బుధవారం మాజీ జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ స్థానిక కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. శ్రీనివాసులు విశిష్ట సేవా రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ప్రతిభా పురస్కారాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు.

మండలానికి చేరిన రాగులు, బెల్లం

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉదయం అందించే రాగిజావ మూడు నెలలుగా నిలిచిపోయింది. ఎట్టకేలకు మండలానికి రాగులు, బెల్లం బస్తాలు బుధవారం చేరాయి. జాజిరెడ్డిగూడెం మండలానికి 28పాఠశాలల్లో 1206 మంది పిల్లలకు రాగిజావ అందించనున్నారు. ఈ రాగులు, బెల్లం ప్యాకెట్లను పాఠశాలల వారీగా పంపిణీ చేస్తున్నట్లు ఎంఈఓ బాలునాయక్ తెలిపారు.

పశువులకు టీకాలు వేయించాలి

అర్వపల్లి : పశువులకు ముందస్తుగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి బి.అర్జున్ కోరారు. మండల పరిధిలోని కుంచమర్తిలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో వీఎల్ఓ కేఎస్ఎస్.పద్మ, ఓఎస్ మధుసూదన్ పాల్గొన్నారు.

బోరు మోటారు దహనం

తిరుమలగిరి : మండలంలోని తొండ గ్రామంలో రైతు కారుపోతుల నరేష్‌కు చెందిన బోరు మోటారును గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి దహనం చేసినట్లు బుధవారం బాధిత రైతు తెలిపారు. నూతనంగా బోరు వేసి మోటారు బిగించామని రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బోరు మోటారును దహనం చేశారని, దీంతో రూ.1.80లక్షల నష్టం జరిగిందని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు వెల్లడించారు.